ప్రజాశక్తి
సోమవారం 10 నవంబర్ 2025
5

అల్లూరి సీతారామరాజు

నేడు హైడ్రోపై రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి -అనంతగిరి:మండల కేంద్రంలోని స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద హైడ్రో వ్యతిరేక రౌండ్ టేబుల్ సమావేశం ఈనెల 10న నిర్వహించడం జరుగుతుందని. హైడ్రో పోరాట కమిటీ కన్వీనర్‌లు సివేరి . కొండలరావు, వంతల బుద్రయ్యలు తెలిపారు. వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాని నవయుగ కంపెనీలతో కుమ్మక్కై హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారన్నారు. దీనిపై భవిష్యత్తు కార్యాచరణ పై చర్చించేందుకు స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి టోకూరు పంచాయతీ చిట్టంపాడు, గుమ్మకోట పంచాయతీ గుజ్జెలి, పెద్దకోట పంచాయతీ రేగులపల్లెం, పెద్దకోట, చింతపాక గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు ఆదివాసి గిరిజన సంఘం. ఉద్యోగుల సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు హాజరు కావాలని కోరారు.

రాళ్లు తేలిన రహదారిపై నడిచి వెళుతున్న గిరిజనులు

అధ్వాన రోడ్లతో అవస్థలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలో మారుమూల సోవ్వ పంచాయతీ జంక్షన్ నుంచి కమల బండమీదుగా సాగరి వలస వరకు నిర్మించిన రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో ఆ ప్రాంత గిరిజనులు ప్రమాణ సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత మూడేళ్ల క్రితం రోడ్డు నిర్మాణం కోసం మట్టిని వేసి అక్కడక్కడ అవసరమైన చోట తారు రోడ్డు నిర్మించకుండా వదిలేశారు. మట్టి వేసి వదిలేయడంతో వర్షాకాలంలో రోడ్డంతా పూర్తిగా బురద మయంగా మారడంతో పాటు రాళ్ల తేలి అధ్వాన్నంగా మారాయి. దీంతో వర్షాకాలంలో ఆ రోడ్డుకు గుండా ప్రయాణించే వాహనదారులు వాహనాలు మట్టిలో కూరుకుపోయి రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాళ్ళు తేలి ఉండడంతో వాహన దారులు ప్రయాణం చేయలేక పోతున్నారు. వ్యాధిగ్రస్తులను హాస్పిటల్ కు తరలించడానికి 108 అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. గిరిజనులు పండించిన అటవీ ఉత్పత్తులను కూడా వారపు సంతలకు తరలించలేక నానా అవస్థలు పడుతున్నారు. నిధులు మంజూరైన పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించడంలో నిర్లక్ష్యం చేస్తూ ఉండటంతో కమల బంధ సాగరి వలస ప్రాంత గ్రామాల గిరిజనులు అధికారులు తీరుపై తీవ్ర వ్యక్తం చేస్తున్నారు. సాగరి వలస రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేసి రవాణా కష్టాలు తీర్చాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లైన గ్రామంలో నేటికీ రహదారి సౌకర్యం, తాగునీరు వంటి మౌలిక వసతులు లేకపోవడంతో గిరి పుత్రులు దయనీయ స్థితిలో జీవిస్తున్నారు. రోడ్డు మార్గం లేక రైల్వే ట్రాక్ బ్రిడ్జి కింద నుండి వెళ్లవసిన పరిస్థితి నెలకొంది. రోడ్డు మార్గం లేకపోవడంతో సకాలంలో వైద్య సేవలు కరువయ్యాయి. విద్య ఇక్కడ అందని ద్రాక్షగా మారింది. బడికి వెళ్లాలంటే రెండు కిలోమీటర్ కొండ ఎక్కి దిగ్గవలసిందే. ప్రభుత్వం ఇళ్లులు మంజూరు చేసినా రోడ్డు మార్గం లేక ఇసుక, సిమెంట్, ఇటుక, ఐరన్, ఇతర ముడిసరుకులు తీసుకెళ్లడానికి రోడ్డు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి రోడ్డు లేకపోవడంతో గర్భిణులను, రోగులను డోలీలో వైద్యం కోసం ఆసుపత్రులకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. తమ సమస్యలను ఎన్నోసార్లు ఎంతోమంది అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వస్తున్న నాయకులు మిగతా సమయాల్లో కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.అధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో గ్రామస్తులే స్వయంగా తాత్కాలిక రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ముందుకొచ్చారు.రోడ్డు నిర్మాణానికి ఇంటింటికి చందాలు పోగు చేసుకుని రెండు కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మించినట్లు తెలిపారు.

రోడ్డు లేక రైల్వే ట్రాక్ బ్రిడ్జి నుంచి రాకపోకలు

అరకులోయ రూరల్:ప్రభుత్వాలు, పాలకులు మారినా గిరిజనుల బతుకులు మాత్రం మారడం లేదు. గిరిజనాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం అభివృద్ధి శూన్యం. దీంతో, గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటు జీవనం గడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వివరాల్లోకి వెళితే అరకులోయ మండలం మాడగడ పంచాయతీ బోసుబెడ్డ గంగగుడ్డి పివిటిజి గిరిజన గ్రామం అభివృద్ధికి ఆమడ దూరాన ఉంది. ఇక్కడ 22 పివిటిజి కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

బ్రిడ్జి కింద నుంచి వెళుతున్న బైకిస్టు

పట్టించుకునే నాథుడే లేడు

అధికారులకు ప్రజాప్రతినిధులకు,ఎన్ని సార్లు పిర్యాదు చేసిన పట్టించుకోలేదు. సరైన రోడ్డు మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు సౌకర్యాలు లేక గృహాలు నిర్మించుకునేందుకు సామగ్రి తెచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో పూరి గుడిసె, పెంకు టిల్లులోనే ఉండి జీవనం సాగిస్తాం. ఏ ప్రభుత్వం వచ్చిన తమ గ్రామానికీ రోడ్డు మౌలిక సదుపాయాలు కల్పన కోసం పట్టించుకో లేదన్నారు.

వంతల డేవిడ్.
వార్డు సభ్యులు

పాల సముద్రంలా..మాడగడ మేఘాల కొండ

పాల సముద్రంలా ఉన్న మేఘాలను వీక్షిస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అరకులోయ నుండి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాడగడ మేఘాలకొండ సన్‌రైజ్ పాయింట్ పర్యాటకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంది. తెల్లవారుజామున సూర్యోదయం సమయంలో పాల సముద్రంలా పసుపు, నారింజ రంగులతో మేఘాలు కొండల మధ్య తేలియాడే స్వర్గం లాగా అనిపిస్తుంది. ప్రతిరోజూ వేలాది మంది పర్యాటకులు ఈ సుందర దృశ్యాన్ని చూసేందుకు ఇక్కడికి తరలివస్తున్నారు. కెమెరాలు చేతబట్టి, మొబైల్‌ఫోన్లతో సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటున్నారు. తెల్లవారుజామున పర్యాటకుల మధ్య దింసా, ఆర్చరీ, ఉయ్యాల వంటి వివిధ గిరిజన నృత్యాలు గిరిజనులు చేస్తూ ఆహ్లాదాన్ని పంచుతున్నారు. సాంప్రదాయ దుస్తులు, పూలతో అలంకరించిన తలపాగాలు ఈ ప్రాంతాన్ని సాంస్కృతిక ఉత్సవ వేదికగా కనువిందు చేస్తున్నాయి.

మాడగడ మేఘాలకొండ పై ఆధారపడి చుట్టుపక్కల వందలాది గిరిజనులు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాఫీ, టీ, టిఫిన్లు, స్థానిక వంటకాలు అమ్ముతూ తమ కుటుంబాలను పోషిస్తున్నారు. పర్యాటకుల రాకతో వారికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఇలా ప్రకృతి సౌందర్యం, గిరిజన సంప్రదాయం, జీవనోపాధి ఈ మూడూ ఒకే వేదికపై మిళితమై మాడగడ మేఘాలకొండను మరింత ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.అరకులోయకు వచ్చే ప్రతి సందర్శకుడు తప్పక ఒకసారి మాడగడ మేఘాలకొండను చూసి, ఆ అనుభూతిని హృదయంలో నిలుపుకుంటున్నాడు.

థింసా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

మరమ్మతుకు గురైన అంబులెన్స్

మరమ్మతుకు నోచని అంబులెన్స్

ప్రజాశక్తి-డంబ్రిగుడ:డంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంబులెన్స్ మరమ్మతుకు గురవడంతో గర్భిణిలు పలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గిరిజనుల సౌకర్యార్థం ఐటిడిఏ పిహెచ్‌సీకి అంబులెన్స్ ఏర్పాటు చేసింది. సుమారు గత నాలుగు నెలల క్రితం అంబులెన్స్ మరమ్మత్తుకు గురవడంతో పాడేరులో షెడ్డుకు తరలించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మరమ్మతు చేయలేదు. వేరే అంబులెన్స్‌ను స్థానిక పీహెచ్‌సీకి మంజూరు చేయక పోవడంతో రోగులు పలు ఇబ్బందులు పడుతున్నారు.ప్రధానంగా గర్భిణిలు ఇబ్బంది పడుతున్నారు. ఈ పిహెచ్‌సిలో నెలకు 50 నుంచి 60 వరకు గర్భిణి ప్రసవాలు జరుగుతున్నాయి. గర్భిణిలను గ్రామాల నుంచి హాస్పిటల్‌కు అంబులెన్స్ లోనే తరలిస్తుంటారు. అంబులెన్స్ అందుబాటులో లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో గర్భిణి మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. తక్షణమే అధికారులు స్పందించి డుంబ్రిగుడ పీహెచ్‌సికి అదనపు అంబులెన్స్ ఏర్పాటు చేయాలని మండలంలోని గిరిజనులు కోరుతున్నారు.

పిఎం జన్‌మన్ గృహాల బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ :- పీఎం జన్ మన్ గృహాల బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని ఆదివాసి గిరిజన సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో గిరిజన సంఘం మండల కమిటి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా నిర్మించుకున్న పీఎం జన్మన్ గృహ లబ్దిదారులకు బకాయి ఉన్న హౌసింగ్ బిల్లులు చెల్లించి, పెంచిన రూలక్షతో కలిపి రూ 10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యాక్రమంలో గిరిజన సంఘం నాయకులు పి డొంబు, పి మోహన్ దాస్ ,వి వసంత్‌కుమార్, రామకృష్ణ, భాస్కరావు, కె రాంబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

శతశాతం ఉద్యోగాల కల్పనకు చట్టం అవసరం

- రంపచోడవరం కేంద్రంగా గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలి
- నర్సింగపేట నుండి పెదమట్టపల్లి వరకూ రోడ్డు వేయాలి
- అన్నవరం వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలి
- ఆదివాసీ గిరిజన సంఘం మండల మహాసభలో పలువురు వక్తలు

మాట్లాడుతున్న పులి సంతోష్ కుమార్, వేదికపై ఎ.అశోక్ తదితరులు

ప్రజాశక్తి- వి.ఆర్‌పురం: ఏజెన్సీలో వంద శాతం ఉద్యోగాలు ఆదివాసీలకు కల్పిస్తూ ఉద్యోగ,ఉపాధ్యాయ నియామక చట్టం వెంటనే ప్రభుత్వం చేయాలని, ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని,రంపచోడవరం కేంద్రంగా గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్ డిమాండ్ చేశారు. మండలంలోని కుంజవారిగూడెంలో ఆదివాసీ గిరిజన సంఘం ఎనిమిదో మహాసభ జరిగింది. ముందుగా ఆదివాసీ గిరిజన సంఘం జెండాను సీనియర్ ఆదివాసీ నాయకులు జల్లి తమ్మయ్య, రవ్వ బుచ్చిరాజులు ఎగురవేశారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏజెన్సీలో వంద శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకే చెందాల్సి ఉన్నా స్థానికేతర గిరిజనేతరులతో వాటిని భర్తీ చేసి గిరిజన యువత ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 3 స్థానంలో ప్రత్యామ్నాయ జిఒ తీసుకొచ్చి గిరిజనులకు ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి నమ్మించి వారిని నట్టేట ముంచి వారి జీవితాలను అంధకారంలో నెట్టి వేయడం దారుణం అన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు గిరిజనులపై కక్ష గట్టాయని ఆపరేషన్ కగార్ పేరుతో ఓ పక్క పోలవరం ముంపు పేరుతో మరో ప్రక్కన ఆదివాసీల సమాజాన్ని అంతం చేస్తున్నాయని అన్నారు. అరకు, పాడేరు ప్రాంతాల్లో 50 గ్రామాల గిరిజన ప్రజలను నిర్వాసితులను చేసే హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణాలు మరోపక్క పాపికొండల అభయారణ్యాన్ని ఆనుకొని ఎకో సెన్సిటివ్ జోన్స్ పేరిట అటవీశాఖ వారు అడవులను ఆక్రమించడం ఇవన్నీ ఒక ప్రణాళిక ప్రకారం గిరిజన సమాజాన్ని చిన్నాభిన్నం చేయడం కోసమేనని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పెట్టుబడిదారీ విధానాలలో భాగంగా ఆదాని ,అంబానీ లకు అటవీ సంపదను అప్పజెప్పడం కొరకు ఆదివాసీ ప్రాంతాలను కేంద్రాలుగా ఎంచుకొని ఇటువంటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. మండలంలో గత ఐదు సంవత్సరాలుగా తవ్వి వదిలేసిన నరసింగపేట-పెద్దమట్టపల్లి తారు రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని, అన్నవరం బ్రిడ్జి హై లెవెల్ వంతెన నిర్మించాలని లేని పక్షంలో ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. ఈ మహాసభలో పలు తీర్మానాలు చేయడం జరిగింది. ఈ మహాసభలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు నాయకులు సీసం సురేష్, ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచులు సవలం మారయ్య, కారం బుచ్చిరాజు, పులి బొజ్జి కారం సుందరయ్య, చిక్కాల రామారావు, ఆత్మకూరి కాంతారావు, తుర్రం బాబురావు, కుంజ రోజ, కళ్యాణ్,బొజ్జి,అనిల్,విజయ్ పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన మహిళలు

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్
- ఉత్సాహంగా సంఘం మండల మహాసభలు
- నూతన కమిటీల ఎన్నిక

చింతూరు: మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

గంగవరం: మహాసభలో సిఐటియు నాయకులు

రాజబమ్మంగి: సిఐటియు మండల మూడో సభలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-చింతూరు: కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, కార్మికచట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. సిఐటియు తొమ్మిదో మండల మహాసభ చింతూరులో ఘనం గా నిర్వహించారు. సిఐటియు జెండాను సీనియర్ నాయకులు చింతరాంబాబు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించి న సమావేశంలో పల్లపు వెంకట్ మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. సిఐటియు అఖిల భారత మహాసభలు విశాఖలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వ తేదీ వరకూ జరగనున్నాయని, దేశంలో ఉన్న కార్మికవర్గ మేధావులంతా ఈ మహాసభలో పాల్గొని భవిష్యత్తు కార్యచరణ గురించి చర్చించనున్నారని తెలిపారు. అదేవిదంగా ఈ నెల 16 17 తేదీల్లో నిర్వహించే సిఐటియు రంపచోడవరం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికలకు ముందు కార్మికులకు అనేక హామీలు ఇచ్చారని వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలన్నీ కాపాడు కోవాలన్నారు. సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, సిఐటియు మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు, గొర్రె లక్ష్మయ్య, చింత రాంబాబు, రవ్వ వీరమ్మ, కుంజ రామరాజు, సోడి సుబ్బారావు. నక్క సురేష్, కుంజా లక్ష్మి, మడకం రాములమ్మ. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

29 మందితో నూతన కమిటీ ఎన్నిక

అనంతరం 29 మందితో నూతన కమిటీని మండల మహాసభ ఎన్నుకోవడం జరిగింది. కమిటీకి కన్వీనర్‌గా పొడియం లక్ష్మణ్, కో కన్వీనర్‌గా కారం సుబ్బారావు ఎన్నికయ్యారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

గంగవరం: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు స్పష్టం చేశారు. గంగవరం మండల సిఐటియు నాలుగో మండల మహాసభ కె.రాణి అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు సీనియర్ నాయకురాలు మిర్తివాడ రెడ్డమ్మ సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల మహాసభ నిర్వహించి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా కే.రాణి, కో కన్వీనర్‌గా మంగయమ్మని ఎన్నుకున్నారు. మరో 19 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ పని గంటలు పెంచుతూ కార్మికుల చేత వెట్టి చాకిరి చేయిస్తూ కార్మికుల శ్రమను దోచుకుని బడా పెట్టుబడుదారులకు దారాదత్తం చేయడానికి ఈ ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు, నాగదేవి, వెంకాయమ్మ, అంగన్వాడి, ఆశ వర్కర్స్, వెలుగు యానిమేటర్స్, మధ్యాహ్న భోజన కార్మికులు స్కూల్ శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలి

రాజవొమ్మంగి: కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ విఘ్నేశ్వర తాపీ మేస్త్రిల సంఘం సమావేశ మందిరంలో సిఐటియు రాజవొమ్మంగి మండల మూడో మహాసభ సిఐటియు నాయకులు రామరాజు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సిఐటియు జెండాను అంగన్‌వాడి సీనియర్ నాయకురాలు రమణమ్మ ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కార్మికులందరికీ ఇన్సూరెన్స్, పీఎఫ్ ఇఎస్ఐ వంటి సంక్షేమ సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం 25 మందితో మండల కమిటీ ఎన్నిక జరిగింది. సిఐటియు మండల కన్వీనర్‌గా తాటితూరి శ్రీనివాస్, కో కన్వీనర్‌గా కలింకోట వెంకటలక్ష్మి ఎన్నిక కాగా మరో 23మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల, సిఐటియు జిల్లా నాయకులు రాంబాబు, గిరిజన సంఘం మండల కార్యదర్శి సూరిబాబు, అంగన్వాడి,ఆశ, మిడ్డే మిల్స్ శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చర్యలను ఆపకుంటే గుణపాఠం చెబుతాం

ఎటపాక: కార్మిక వ్యతిరేక చర్యలు ఆపకుంటే తగిన గుణపాఠం చెపుతామని జిల్లా రైతు సంఘం నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఐ.వి, ఫీల్డ్ అసిస్టెంట్ల జిల్లా నాయకులు రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సభ ప్రారం భాని కి ముందు సీనియర్ నాయకులు విద్యుత్ కార్మికుడైన పల్లంటి ప్రకాష్ సిఐటి యు జెండాను ఆవిష్కరిం చారు. మహాసభకు అధ్యక్షవర్గంగా కె.బాలరాజు, టి.రవి, సున్నం కుమారి, పి.రాములమ్మ, వ్యవహరిం చారు. మినిట్స్ కమిటీ సభ్యులుగా ఐ.పద్మావతి వ్యవహరించారు. అనంతరం 25 మంది మండల కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. మండల కన్వీనర్‌గా పులుసు బాలకృష్ణను, కో-కన్వీనర్‌గా తోట శ్రీనివాసరావును మహాసభ ఎన్నుకుంది.

ఎటపాక: సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న పల్లంటి ప్రకాష్

స్థానిక సంస్థల ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేయాలి

ప్రజాశక్తి - జికె వీధి: స్థానిక సంస్థల ఎన్నికల్లో అంతా కలసికట్టుగా పనిచేయాలని టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు, జనసేన పంచాయతీ అధ్యక్షులు ఈశ్వరరావు సమావేశమయ్యారు. మండలంలోని సంకాడ పంచాయతీలో ఆదివారం సమావేశమయ్యారు స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చించారు. టిడిపి ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు బూత్ కన్వీనర్లుగా నియామకం, గతంలో పంచాయతీ నిధుల గురించి చర్చించడం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ముట్టడం లక్ష్మణరావు, గ్రామ కమిటీ కార్యదర్శి రాజారావు, తెలుగు యువత ఉపాధ్యక్షులు గంగాధర్, యూనిట్ ఇంచార్జ్ మామిడి చంటిబాబు, బూత్ కన్వీనర్ సడ్డ బుజ్జి పడాల్, జనసేన పంచాయతీ ప్రధానకార్యదర్శి జర్త బాబురావు, రాజబాబు పాల్గొన్నారు.

సీ ప్లేన్ ఏర్పాటుకు సర్వే

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో సీ ప్లైన్ ఏర్పాటుకు ఆదివారం (ఎస్‌హెచ్‌ఓఎన్‌టి) కంపెనీ ఇంజనీర్లు సర్వే నిర్వహించారు. సీలేరు కాంప్లెక్స్ పరిధి స్థానిక గుంటవాడ జలాశయంపై సీ ప్లైన్ రన్‌వే కోసం జలాశయం ఎక్కడెక్కడ ఎంతెంత లోతు ఉందో వివరాల కోసం డిజిబిఎస్ సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో(ఫీడ్ బ్యాక్ హైవేస్ ఇన్ఫ్రా కంపెనీ) ఇంజనీరు తన్వి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారు హుడా రీజనల్ కనెక్టివిటీ స్కీం(ఆర్‌సిఎన్ ఉడా)లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో సీ ప్లైన్ ఏర్పాటుకు 8 ప్రాంతాలను ఎంపిక చేశారని తెలిపారు. ప్రకాశం బ్యారేజ్, గండిపేట, శ్రీశైలం, కాకినాడ, విశాఖపట్నం, సీలేరు ఎంపిక చేశారని ఆయా ప్రాంతాల్లో సి ప్లైన్ ఏర్పాటుకు రన్‌వే, ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించిన టెండర్లు తమ కంపెనీకి రావడంతో ఈ మేరకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భాగంగా జి ప్లస్ భవన నిర్మాణానికి రెండు ఎకరాల భూమి అవసరమని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కి (ఎపిఎడిసి) నివేదిక పంపామన్నారు.

కలెక్టర్‌తో సివిల్ సర్వీస్ ట్రెయినీ బృందం

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ సివిల్ సర్వీస్ బృందం

ప్రజాశక్తి-పాడేరు:దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ట్రైనీ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్, ఇతర సివిల్ సర్వీస్ అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిపాలనపై శిక్షణ, పర్యటన నిమిత్తం వై.రామవరం మండలంలో ఈనెల 10 నుంచి పర్యటించనుంది. ఈనెల 16 వరకు మొత్తం తొమ్మిది రోజుల పాటు దల్లిపాడు, చామగడ్డ గ్రామాలలో వీరు శిక్షణ పొందనున్నారు. ఈ బృందంలో ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్ మరియు ఐఎఫ్ఎస్ వంటి వివిధ విభాగాలకు చెందిన మొత్తం 12 మంది ట్రైనీలు ఉన్నారు. వీరిలో ఐఎఎస్, ఐపిఎస్ కు చెందిన హరిత్విక్ రంజాన్- బీహార్), (ప్రగ్య సైని- రాజస్థాన్), అభినవ్ శర్మ - యూపీ)తో పాటు పలువురు ఉన్నారు. శిక్షణ మరియు అధ్యయనం కోసం వచ్చిన ఈ ట్రైనీ అధికారులు ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎ ఎస్. దినేష్ కుమార్ తో ఆయన క్యాంప్ ఆఫీసులో భేటీ అయ్యారు. ట్రైనీ అధికారులు గ్రామీణ పరిపాలనా విధానాలను, ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రత్యక్షంగా పరిశోధన చేయనున్నారని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. శిక్షణా పర్యటన విజయవంతం అయ్యేందుకు గాను, ట్రైనీ అధికారులకు సమగ్రమైన సమాచారాన్ని అందించాలని కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలకు సంబంధించిన నివేదికలు, పురోగతి వివరాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరు సమాచారాన్ని ఆంగ్లంలో అందించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాడేరు రెవిన్యూ డివిజనల్ అధికారి లోకేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

శ్రమదానంతో తాగునీటి పైప్‌లైన్ పనులు

మరమ్మతు చేపడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఆ గ్రామంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉండడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో, ఎన్ని సార్లు చెప్పినా ఉపయోగం లేదని, ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గ్రామస్తులు విసుగు చెంది తమ గ్రామంలో ఉన్న సమస్యను పరిష్కరించుకునేందుకు స్వతసిద్ధంగా ముందుకు ఐక్యంగా కదిలి వచ్చారు. శ్రమదానంతో సమస్యను పరిస్కరించుకున్నారు. మండలంలోని కొల్లపుట్టు పంచాయతీ బొడ్డమామిడి గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక గత కొన్ని నెలలు నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.తప్పని పరిస్థితిలో సమీపంలోని ఊట గెడ్డ నీటిని సేకరించి ఉపయోగిస్తున్నారు. ఆ నీళ్లు సరిపోక నానా అవస్థలు పడుతున్నారు. దీంతో సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలు మార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సొంతంగా గ్రామస్తులంతా డబ్బులు ఎత్తుకుని 90 మీటర్ల గ్రావిటీ పైపు గొట్టాలు కొనుక్కుని నిర్మించుకున్నామని గ్రామస్తులు గోవర్ధన్, అప్పారావు, నరసింగరావు, దయ తెలిపారు. తక్షణమే అధికారులు గ్రావిటీ పథకం మంజూరు చేసి తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏజెన్సీలో వరి కోతలు

కోతలు కోస్తున్న గిరిజన రైతులు

ప్రజాశక్తి- హుకుంపేట: ఏజెన్సీ ప్రాంత వ్యాప్తంగా వరి కోతల సీజన్ ప్రారంభమైంది. వర్షాలు తగ్గడంతో వ్యవసాయ పనులు ఇప్పుడు వేగంగా సాగుతున్నాయి. ఈ నెల నుంచి వరి కోతలు, నూర్పులు ముమ్మరంగా కొనసాగుతాయి. హుకుంపేట, భరమసి, జి. తాడే పుట్టు, కొట్నా పల్లి, రంగశీల,గడికించుమండ, కోంతిలి, శోభకోట, బాకూరు, మట్టుజోరు, తడిగిరి, పట్టాం, సుకూరు, బూర్జ పంచాయతీల రైతులు వరి కోతలు మొదలు పెట్టారు. నూర్పు కేంద్రాలకు ధాన్యం తరలింపు పనుల్లో బిజీగా ఉన్నారు. మొంథ తుఫాన్‌తో పంటలు తడిసి నష్టపోయాయని రైతులు తెలిపారు. వరి ధాన్యం నాణ్యత సాధారణంగా ఉన్నా దిగుబడి కొంత తగ్గిందని వాపోయారు. రైతులు పొలాల్లో యంత్రాల సాయంతో కోతలు పూర్తి చేసి, ఎండబెట్టి నూర్పులకు సిద్ధం చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ, 'శీతాకాలం పొడవునా వరి కోతల సీజన్ కొనసాగుతుందన్నారు. రైతులు తడిసిన ధాన్యాన్ని సరైన రీతిలో ఎండబెట్టిన తర్వాతే విక్రయించాలని సూచించారు.

నూరుస్తున్న రైతులు

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -పాడేరు : గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న 104 వాహనాల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని 104 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ పడాల్ డిమాండ్ చేశారు. ఆదివారం పాడేరు జిల్లా కేంద్రంలో 104 ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, .చాలీ చాలని వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నామన్నారు అరబిందో నుండి రావాల్సిన బకాయిలు, గ్రాడ్యుటీ, ఎర్న్ లీవ్‌ల నగదు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అరబిందో నుండి రావాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత యాజమాన్యం భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ఉద్యోగుల సంక్షేమం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఉద్యోగులపై తీవ్రమైన ఒత్తిడి పెట్టి పనిచేస్తున్నారన్నారు. ఇప్పటివరకు నియామక పత్రాలు, పే స్లిప్స్ కూడా ఇప్పటి వరకు ఉద్యోగులకు అందచేయలేదన్నారు. 2020 తరువాత జాయిన్ అయిన వారికి జీతాల పెంపు లేనందున గత ఐదున్నర సంవత్సరాలు గా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు.డి.ఈ.ఓ లకు ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ జీవో ప్రకారం 18500 జీతం ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు క్యాజువల్ లీవ్ లు అమలు చెయాలన్నారు. ఈఎస్ఐ పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. వెహికిల్ ఇన్సూరెన్స్, ఫిటినెస్ లు వెంటనే చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి రామ్మూర్తి, జిల్లా నాయకులు అప్పలరాజు, ఎస్ కే నజీర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని బీంపోలు పంచాయతీ సరియాపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య తక్షణమే పరిష్కరించాలని ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు జేష్ట .వెంకటరమణ డిమాండ్ చేశారు. సమస్యలు తెలుసుకునేందుకు ఆదివారం గ్రామంలో సందర్శించారు. గ్రామస్తులు మాట్లాడుతూ, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ట్యాంకు వద్ద మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న బోరు, మోటార్ కనెక్షన్ పైప్ లైన్ మరమ్మతు గుర్రె నెలలు గడుస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకున్న దాఖలు లేవన్నారు. దీంతో గత్యంతరం లేక గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న చెలమ నీటిని ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే బోరు మోటార్ కనెక్షన్ మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామస్తులు మిర్యాల .అప్పల స్వామి, గెమ్మెల లక్ష్మణరావు, ముత్యాలు, శ్రీదేవి. తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కురుస్తున్న మంచు

దట్టంగా పొగమంచు

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రం, పరిసర గ్రామాల్లో ఆదివారం ఉదయం దట్టమైన పొగమంచు కురవడంతో ప్రజలతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెల్లవారుజామున 5 గంటల నుండి 7 గంటల వరకు దట్టమైన పొగమంచు చుట్టుముట్టింది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు.గ్రామాల్లో రోడ్లపై కూడా దట్టమైన పొగమంచు కురవడంతో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు.

ఖాళీ కంచాలతో నిరసన చేపడుతున్న కాఫీ కార్మికులు

ఖాళీ కంచాలతో కాఫీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి -పాడేరు:పెరిగిన కూలి రేటు ప్రకారం తమకు వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాఫీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాలుగవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సమ్మెలో భాగంగా ఆందోళన చేస్తున్న కాఫీ కార్మికులు మినుములూరు కాఫీ ఎస్టేట్ వద్ద ఆదివారం ఖాళీ కంచాలతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు సుందర్రావు, హెల్పర్లు కాంతమ్మ సత్యనారాయణ, రాంబాబు, మంగమ్మ, లక్ష్మి దేవి చిన్నాలమ్మ, వరలక్ష్మి, కాఫీ కార్మికులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి విలు విద్య పోటీలకు 'మోదమాంబ' విద్యార్థి ఎంపిక

ఎంపికైన విదార్థితో ప్రిన్సిపల్, కోచ్

ప్రజాశక్తి-పాడేరు:స్థానిక జూనియర్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన 69వ రాష్ట్ర స్థాయి విలువిద్యా పోటీలలో మోదమాంబ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న సిహెచ్ మోహిత్ సాయి అండర్ -17 విభాగంలో పాల్గొని మొదటి స్థానం సాధించి సత్తా చాటాడు. తదుపరి జరిగే జాతీయ స్థాయి విలువిద్యా పోటీలకు ఎంపికయ్యాడు. ప్రతిభ చూపించిన మోహిత్ సాయి జాతీయ స్థాయి విలువిద్యా పోటీలకు ఎంపికైనందుకు పాఠశాల ప్రిన్సిపాల్, కోచ్, సిబ్బంది అభినందించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-చింతపల్లి: మండల కేంద్రం చింతపల్లి కూడలిలో పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. గుట్టుగా రవాణా చేస్తున్న గంజాయి, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను అరికట్టే క్రమంలో శనివారం రాత్రి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. స్థానికఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ బాలాజీ, కానిస్టేబుల్స్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు. వాహనాలు, ద్విచక్ర వాహనాలు, సరకు రవాణా వాహనాలను ఆపి పూర్తిగా పరిశీలించారు ఏజెన్సీలో ప్రమాదకర మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.

ఆటో ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి- జికే వీధి: మండలంలోని ముల్లుమెట్ట సమీపంలో రోడ్డుకి అడ్డుగా వచ్చిన పాపని ఆటో డ్రైవర్ తపించబోయి సడన్ బ్రేక్ వేయగా రెండు పల్టీలు కొట్టింది. వివరాల్లోకి వెలితే చిన్నగడ్డ గ్రామం వాస్తవ్యులు టంగులగొంది వెళ్లి వస్తుండగా ముల్లుమెట్ట వద్ద ప్రమాదం జరిగింది. ఆటోలో ఉన్నవారికి స్వల్పగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స కోసం 108 లో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు పక్కన తుప్పల తొలగింపు

ప్రజాశక్తి- గంగవరం: ప్రమాదాల నివారణకు ఎస్‌డిపిఒ రంపచోడవరం అడ్డతీగల సీఐ ఆదేశాల మేరకు రోడ్డుకిరువైపులా తుప్పలు తొలగించినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఈ మధ్య జరుగుతున్న ప్రమాదాల నివారణకు గంగవరం నుండి నెల్లిపూడి వరకు రహదారికిరువైపులా ఉన్న చిన్న చిన్న తుప్పలు, పొదలు, చెట్లు తొలగించామన్నారు. గంగవరం ఎస్సై, సిబ్బంది వాటిని తొలగించారు. ఏఎస్ఐ, మహర్షి, రజాక్ సిబ్బంది సాయి, కొండబాబు పాల్గొన్నారు.

తుప్పలు తొలగిస్తున్న పోలీస్ సిబ్బంది

నరేష్ కుమార్‌కు సత్కారం

నరేష్‌కుమార్‌ను కలసిన మండల కమిటీ నాయకులు

ప్రజాశక్తి -వి.ఆర్.పురం: మండల నూతన టిడిపి మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్‌ను ఆదివారం కూనవరం మండల టిడిపి మండల కమిటీ మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. పోలవరం సమస్యలు గురించి చర్చించారు. రెండు మండలాల టిడిపి కమిటీలు కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధి పథంలో కొనసాగిస్తామని, పార్టీని బలోపేతం చేస్తామని మండల కమిటీ నాయకులు తెలియజేశారు. కార్యక్రమంలో కూనవరం మండల టిడిపి అధ్యక్షులు ఎడవల్లి భాస్కర్, ఉపాధ్యక్షులు చిలకాని ఉమా మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పోడియం అప్పారావు, ఎచ్చు రాము, రవి ,శ్రీను టిడిపి మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సన్‌ఫీస్ట్ ఫెంటాస్టిక్ నుండి నూతన ఉత్పత్తులు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఐటిసి ఫుడ్స్ డివిజన్, సన్‌ఫీస్ట్ ఫెంటాస్టిక్ శ్రేణిలో భాగంగా 'చాకోమెల్ట్' అనే నూతన ఉత్పత్తిని మార్కెట్లోకి ఆదివారం విశాఖలో విడుదల చేసింది. ఈ స్క్విజబుల్ (నొక్కబడే), రిచ్ అండ్ స్మూత్ మోల్టన్ చాకోను కేవలం రూ.5 ధరలో అనుకూలమైన ప్యాకేజింగ్‌లో అందిస్తున్నామని ఐటిసి ఫుడ్స్ డివిజన్ మార్కెటింగ్ హెడ్ అనుజ్‌బన్సల్ తెలిపారు.ఆదివారం బీచ్ రోడ్‌లోని ఐటిసి వెల్కమ్ గ్రాండ్‌బే హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చాకోమెల్ట్ అనేది విలక్షణమైన అనుభూతిని ఇచ్చే ఒక ప్రత్యేకమైన ఉత్పత్తి అని తెలిపారు. ప్రస్తుతం కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో జూన్ 1, 2025 నుండి లభిస్తోందని దీనిని ఆంధ్రప్రదేశ్‌లో నేడు విడుదల చేయటం జరిగిందని తెలిపారు. కార్యక్రమం లో సంస్థ క్రియేటివ్ డైరెక్టర్ సుచిత్రా గహ్లోట్ పాల్గొన్నారు.

శబరిమలైకి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం నుండి శబరిమలై భక్తులు కొరకు ప్యాకేజెస్‌తో స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు ఆర్టిసి రీజినల్ మేనేజర్ బి. అప్పలనాయుడు తెలిపారు. పంచారామాలకి నిర్వహించిన బస్సులకు మంచి స్పందన లభించినదని, అదేవిధంగా శబరిమలైకి కూడా మంచి స్పందన ఉందన్నారు. అదేవిధంగా సత్య సాయి జన్మదిన ఉత్సవాల సందర్భంగా ఈనెల 19 నుండి 23వ తేదీ వరకు పుట్టినరోజు ఉత్సవాలు జరుపుతున్నారని, ఈ సందర్భంగా స్పెషల్‌బస్సులు విశాఖపట్నం నుండి నడపబడునని కావలసినవారు ద్వారకా బస్‌స్టేషన్ ఎపిఎస్‌ఆర్టీసి కాంప్లెక్స్ లో, 9959225602 నెంబర్ తో సంప్రదించవచ్చన్నారు.

భాగస్వామ్య ఏర్పాట్ల పనుల్లో మరింత వేగం పెంచాలి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దిశానిర్దేశం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఈ నెల 14, 15వ తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సు ఏర్పాట్ల పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఎయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న పనులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్ణీత సమయం కంటే ముందుగానే పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రధాన వేదిక, స్వాగత ద్వారాలు, అతిథుల రాక, పార్కింగ్ వసతి తదితర అంశాలపై సూక్ష్మ స్థాయి పరిశీలన చేసి పలు ప్రాంతాల్లో ఇంకా చేయాల్సిన పనులపై అధికారులను అప్రమత్తం చేశారు. జివిఎంసి సిఇకి పలు అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై, మార్పులు చేర్పులపై ఆదేశాలు జారీ చేశారు. డిసిపి మణికంఠ చందోలు, జివిఎంసి సత్యనారాయణరాజు, సిఎంఒ నరేష్ కుమార్, సిఐఐ ప్రతినిధి మౌళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

భారత వారసత్వ సామరస్య యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: భారత వారసత్వం - సామరస్యం నినాదంతో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఎఐ) ఆంధ్రప్రదేశ్‌శాఖ చేపట్టిన అంతర్ రాష్ట్ర అవగాహన యాత్ర ఆదివారం విశాఖలో మొదలైంది. వైహెచ్ఎఐ ముఖ్య పోషకులు, కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ సి.హెచ్ శ్రీనివాస్ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర శాఖ చైర్మన్ సి.హెచ్.రవిపాల్, గౌరవకార్యదర్శి ఎం.డి.ఇబ్రహీం, కోశాధికారి శ్రీనివాసరావు, పూర్వ చైర్మన్ ఉమామహేశ్వరరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.వి.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూత్ హాస్టల్స్ అసోసియేషన్ కార్యదర్శి ఇబ్రహీం మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో సాగే ఈ యాత్రలో,చారిత్రక దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు, వారసత్వ ప్రదేశాలను సందర్శిస్తారన్నారు. విశాఖపట్నంలో సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయం, ఋషికొండ టిటిడి బాలాజీ ఆలయం, శ్రీకాకుళం అరసవల్లి సూర్య నారాయణమూర్తి,శ్రీ కూర్మనాథ ఆలయాలు, శ్రీముఖలింగం మీదుగా ఈ బృందం ఒడిశాలోని చిలకా చేరుకుంటుందన్నారు. చిలకాలో రాత్రికి బస చేసి మరుసటి రోజు సరస్సులోని కాళీమాత ఆలయాన్ని దర్శిస్తుందని, అక్కడి నుండి పూరి క్షేత్రానికి చేరుకుని,పూరి జగన్నాథ స్వామి దర్శనం అనంతరం కోణార్క్ వెళ్తుందన్నారు. కోణార్క్ వారసత్వ సంపదను తిలకించిన అనంతరం భువనేశ్వర్ లోని లింగరాజ స్వామి ఆలయం, అనంతరం బృందం విశాఖపట్నం చేరుకుంటుందన్నారు.5 రోజులు పాటు సాగే యాత్రలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర,గుజరాత్, రాజస్థాన్,కర్ణాటక రాష్ట్రాల నుంచి పది మంది మహిళలు సహా 25 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు.

సామరస్యయాత్ర ప్రారంభిస్తున్న వైహెచ్ఎఐ బృందం

స్టీల్ ప్లాంట్ రక్షణపై కూటమి ప్రభుత్వానికి శ్రద్ధలేదు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటంలో కూటమి ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపటం లేదని, షిప్‌యార్డ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీరందాసు ప్రసాద్ ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు ఆదివారానికి 1668వ రోజుకు చేరాయి.దీక్షల్లో బిహెచ్ఇఎల్, హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లకు చెందిన సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీరందాసు మాట్లాడుతూ, ఇంకా నిర్మాణం కూడా కాని ఆర్సీ మిట్టల్‌స్టీల్ కోసం సొంతగనులపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ రంగ విశాఖస్టీల్‌పై కూటమి ప్రభుత్వానికి లేకపోవడం ఆశ్చర్యంతో పాటు, ప్రభుత్వరంగం పట్ల వీరి చిత్తశుద్ధిని సంశయించేలా ఉందని అన్నారు. బిహెచ్ఇఎల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జి.టి.పి ప్రకాష్ మాట్లాడుతూ,స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. నాటి బిహెచ్‌పివిని కూడా ప్రైవేటీకరించాలని కేంద్రం ప్రయత్నించిందని కార్మికులు చేసిన పోరాటం ఫలించి యుపిఏ 1 ప్రభుత్వ కాలంలో వామపక్షాల సహకారంతో కాపాడుకున్నామన్నారు. స్టీల్ పోరాటానికి బిహెచ్ఇఎల్ కార్మికుల మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈరోజు దీక్షల్లో కందుల నారపురెడ్డి, అప్పలనారాయణ ఆల్సి, షిప్ యార్డ్ నాయకులు బిఎస్ఎన్ రాజు,పొన్నా శివరాం, అచ్చిన్నాయుడు, నారపురెడ్డి,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షల్లో కూర్చున్న నాయకులు

11న ఎపి లేబర్ సమ్మిట్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపి లేబర్ సమ్మిట్ - 2025 పేరిట మంగళవారం ఉదయం 10 గంటలకు విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరుగనుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగనున్న నేపథ్యంలో కొన్ని ముఖ్యమైన అంశాలపై సదస్సులు నిర్వహించాలని ఆహ్వాన సంఘం భావించిందని, అందులో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నటువంటి పారిశ్రామికవేత్తల పెట్టుబడుల సమ్మిట్‌కు ప్రత్యామ్నాయంగా ఈ నెల 11న సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎపి లేబర్ సమ్మిట్ - 2025 నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ద్రవిడ యూనివర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ కెఎస్.చలం హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలో ఉన్నటువంటి మేధావులు, అభ్యుదయవాదులు, కార్మిక సంఘాల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని వెల్లడించారు. ప్రభుత్వం పారిశ్రామికాధిపతులకు పరిశ్రమల పేరిట కారు చౌకగా ప్రభుత్వ భూములు కట్టబెడుతోందని, కానీ పరిశ్రమలు రావడం లేదని, ఉపాధి లభించడం లేదని, సరికదా ఉన్న ఉపాధినే కోల్పోతున్న పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఇప్పటికే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో పర్మినెంట్ కార్మికులను విఆర్ఎస్ ంపేరుతో రెండు వేల మందిని, కాంట్రాక్ట్ కార్మికులను 5,500 మందిని తొలగించారన్నారు. విశాఖ డెయిరీలో 300 మందికి పైబడి కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారన్నారు. ఇంకా అనేక ప్రభుత్వ రంగ సంస్థలలో రిటైర్ అయిన, చనిపోయిన పోస్టులను భర్తీ చేయకుండా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులతో పనులు చేయించుకుంటున్నారన్నారు. ఈ కాలంలో అనేక పెట్టుబడుల సమ్మిట్లు జరిగినా ఫలితం శూన్యంగానే ఉందన్నారు. మళ్లీ ఇప్పుడు పారిశ్రామిక సమ్మిట్ పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతూ రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని, లక్షల్లో ఉద్యోగాలు దక్కుతాయని ప్రజల్ని మభ్యపెట్టే విధంగా ప్రభుత్వ ప్రకటనలు ఉన్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితిని తెలిపేందుకు లేబర్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. దీన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

భాగస్వామ్య సదస్సుకు విశాఖ ముస్తాబు

పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా సమ్మిట్ : అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఆధ్వర్యంలో జరగనున్న 30వ భాగస్వామ్య సమ్మిట్ - 2025 కోసం విశాఖ నగరం ముస్తాబవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ సదస్సు ఈ నెల 14, 15 తేదీల్లో ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరగనుంది. దీన్ని పురస్కరించుకుని భారీగా పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు నగర మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి పలు చర్యలు చేపడుతున్నట్టు జివిఎంసి, జిల్లా అధికార యంత్రాంగం చెబుతోంది.

పెట్టుబడుల అంచనాలు.. లక్ష్యాలు

ఈ రెండు రోజుల సదస్సు ద్వారా ఎపికి దాదాపు 9.8 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సమ్మిట్‌లో సుమారు 410 అవగాహనా ఒప్పందాలపై సంతకాలు జరగాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 7.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం చెబుతోంది. ఈ రెండు రోజుల్లో రూ.2.7 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుపుతామని అంటోంది. ముఖ్యంగా గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, ఎన్‌టిపిసి, బిపిసిఎల్, రిలయన్స్, టిసిఎస్ వంటి అంతర్జాతీయ, దేశీయ దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయని సర్కారు చెబుతోంది. బీచ్ రోడ్డులో నూతనంగా నిర్మించనున్న లూలూ మాల్‌కు శంకుస్థాపన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

సుందరీకరణ పనులకు భారీ వ్యయం

ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అంతర్జాతీయ ప్రతినిధులు, అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలు విశాఖకు రానున్న నేపథ్యంలో సుందరీకరణ పనులను జివిఎంసి చేపట్టింది. సుమారు రూ.42 కోట్ల నుంచి రూ.60 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేస్తున్నారు. ఇప్పటికే 212 అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. అందులో ప్రధానంగా రహదారులు, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ప్రతినిధులు పర్యటించే అవకాశం ఉన్న 17 ప్రధాన రహదారులలో సుమారు 64 కిలోమీటర్ల మేర కొత్త తారు లేయర్లు వేయడం లేదా మరమ్మతులు చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లకు టైల్స్ మార్పు, డివైడర్లకు రంగులు ప్రధాన కూడళ్లను ఆధునీకరించడం చేస్తున్నారు.